క్లుప్తంగా

కొత్తపురమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సంబేపల్లె : మండల పరిధిలోని దుద్యాల పంచాయతీ సమీపంలోని కొత్తపురమ్మ ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం నుంచే అమ్మవారి మూల విరాట్‌మూర్తికి భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు చేశారు. మండలం నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో అమ్మవారి దర్శనానికి తరలివచ్చారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇంటర్ విద్యార్థులకు హాల్ టికెట్లు



హాల్ టికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ

పెనగలూరు : ఇంటర్మీడియట్ పరీక్షల హాల్ టికెట్లను విద్యార్థులకు అందజేశారు. మండలంలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు గురువారం హాల్ టికెట్లు పంపిణీ చేసినట్లు ప్రిన్సిపాల్ సహజ బ్లెస్సీ తెలిపారు. అలాగే విద్యార్థులను పిలిపించి ఆయా సబ్జెక్టుల అధ్యాపకులతో పరీక్షకు సంబంధించి పలు సూచనలు, సలహాలు తెలియజేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. మంచి మార్కులతో సాధించాలని విద్యార్థులకు అధ్యాపకులు సూచించారు.

మున్సిపల్ ఉద్యోగుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రాయచోటి అర్బన్ : తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చూపుతున్న అలసత్వాన్ని నిరసిస్తూ ఏపీ జేఏసీ ఆధ్వర్యంలో ఉద్యోగులు శుక్రవారం నిరసన ప్రదర్శన చేశారు. జిల్లా మున్సిపల్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున ఆధ్వర్యంలో మున్సిపల్ ఉద్యోగులు నల్ల రిబ్బన్‌లు ధరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేశారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

గాలివీడు : విద్యకు ఆభరణం క్రమశిక్షణ అని ఎంపీడీఓ శేఖర్ నాయక్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలోని స్థానిక గౌతమ్ పాఠశాలలో ఏర్పాటు చేసిన వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు.

భూముల రీ సర్వే హర్షణీయం

పెనగలూరు : డ్రోన్ల సాయంతో భూముల రీ సర్వే చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంకల్పించిన తీరు హర్షణీయమని కట్టావారిపల్లి సర్పంచ్ బాలు మోహనమ్మ, సచివాలయ కన్వీనర్ బాలు శివయ్య నాయుడులు హర్షం వ్యక్తం చేశారు. ఇప్పటికీ బ్రిటీష్ కాలం నాటి సర్వేను ఉపయోగిస్తున్నామని దీంతో భూములను ఆధునిక సాంకేతికతతో భూముల రీ సర్వేతో రైతుల భూ వివాదాలకు పరిష్కారం చూపవచ్చునన్నారు. కార్యక్రమంలో సర్వేయర్ ఓబయ్య, సచివాలయ సర్వేయర్లు, వీఆర్‌ఓ దుర్గయ్య, డ్రోన్ ట్రైనర్లు పాల్గొన్నారు.

అందరం పని చేద్దాం.. జగనన్నను గెలిపించుకుందాం

మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, కొల్లం గంగిరెడ్డి



పుల్లంపేట: హాజరైన గృహసారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు



పుల్లంపేట: మాట్లాడుతున్న ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు

పుల్లంపేట : వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని రైల్వేకోడూరు శాసనసభ్యుడు, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. గురువారం నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొల్లం గంగిరెడ్డి ఆధ్వర్యంలో పుల్లంపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో 'మా నమ్మకం నువ్వే జగన్' సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు సమష్టి కృషితో పనిచేస్తే 2024లో అధికారం మనదే అన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్ళి వారికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని, పేదల సంతోషమే జగనన్న లక్ష్యమన్నారు. అనంతరం నియోజకవర్గ సీనియర్ నాయకులు కొల్లం గంగిరెడ్డి మాట్లాడుతూ జగనన్న పాలనలో పార్టీలకతీతంగా ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నామన్నారు. అందరూ కలిసికట్టుగా మరలా జగనన్నను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు ఎన్నికల పరిశీలకులు పి.సునీల్ కుమార్, మండల సచివాలయ కన్వీనర్ హరినాథ్ రెడ్డి, జెడ్పీటీసీ రామనాథం, వైస్ ఎంపీపీ సారథి, విజయ్ కుమార్ రెడ్డి, శంకర్ రెడ్డి, ఆకేపాటి శ్రీనివాసులు రెడ్డి, మండల కన్వీనర్ ముస్తాక్, సర్పంచ్ కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మూగా వెంకటరెడ్డి, బీకే మణి, నలినీకాంత్ రెడ్డి, గంగాధర్, నాయక్, లక్ష్మీనారాయణ, వెంకటరమణ పాల్గొన్నారు.

నివాళి

ఓబులవారిపల్లె : మాజీ ఎంపీపీ తమ్మెద తిరుపాల్ సోదరుడు తమ్మెద శంకరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. గురువారం ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు, నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు పులి సునీల్ కుమార్‌లు మృతుని చిత్రపటానికి ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుడు విజయ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

100శాతం అధికారం మనదే!

రైల్వేకోడూరు : ఇవాళ ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లగలుగుతున్నామంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో చేసిన అభివృద్ధిని, సంక్షేమమే కారణమని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ పరిశీలకులు పులి సునీల్‌కుమార్‌తో కలిసి మండలం గ్రామ సచివాలయాల కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులతో సమావేశమయ్యారు. ప్రభుత్వవిప్ కొరముట్ల మాట్లాడుతూ సీఎం జగనమోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తరువాత రైల్వేకోడూరు నియోజకవర్గ చరిత్రలోనే ఎన్నడూ లేనివిధంగా వేగంగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం చేసిన పనితీరును, ప్రస్తుతం సీఎం జగనన్న సారథ్యంలో మేము చేస్తున్న ప్రజా రంజక పరిపాలను గమనించి చంద్రబాబు నాయుడు, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్, ఎల్లో మీడియా విషపు రాతలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ ప్రజలలో విశ్వసనీయతను పెంచుకోవాలని తెలిపారు. ప్రస్తుతం నియోజకవర్గంలో సుమారు 100కోట్లతో బీటీ, సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. టీడీపీ ప్రభుత్వంలో ఎవరైనా ఇంత అభివృద్ధి జరిగిందని టీడీపీ నాయకులు ముందుకు రాగలరా అని సవాల్ విసిరారు. దీన్ని ఓర్చుకోలేక ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నంగా దొంగయాత్రలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. నియోజకవర్గ పరిశీలకులు పులి సునీల్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి లబ్ధిచేకూరిందని, అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందాయని ధీమాగా చెప్పుతున్నామన్నారు. లోకేష్ వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం లేదని, కేవలం లోకేషది ఒక పనికిమాలిన యాత్ర అని అభివర్ణించారు. కార్యక్రమంలో పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ముప్పాల హేమనవర్మ, జెట్పీటీసీ రత్నమ్మ, సుధాకర్‌రాజు, ఉప సర్పంచ్ తోట సాయి, పట్టణ అధ్యక్షుడు సీహెచ్.రమేష్, ఆర్యవైశ్య నాయకుడు రమేష్, లింగం లక్ష్మీకర్, పల్లం రమేష్, సుదర్శన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డీలర్లు రాగి పిండి, బెల్లం పొడిని తీసుకెళ్లాలి

రామాపురం : మండలంలోని 13 గ్రామపంచాయతీల పరిధిలోని 35 చౌకదుకాణాలకు సంబంధించి డీలర్లు రాగి పిండి, బెల్లం పొడి తీసుకెళ్లాలని లక్కిరెడ్డిపల్లె ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ ఉస్మాన్ సాహెబ్ తెలిపారు. రాగి పిండి, బెల్లం పొడిని లక్కిరెడ్డిపల్లె బియ్యం గోడౌన్‌లో నిల్వలు ఉన్నాయని, ఆయా గ్రామాల్లో డీలర్లు వెంటనే వచ్చి వాటిని తీసుకెళ్లాలని ఆయన అన్నారు. నిత్యావసర సరుకులను డీలర్‌షాపు పరిధిలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అప్పగించాలని తెలియజేశారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లక్కిరెడ్డిపల్లి/రామాపురం సంబేపల్లె : 2023-24 విద్యా సంవత్సరానికి ఐదోతరగతి, ఇంటర్మీడియట్‌ల్లో ప్రవేశానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విజయ తెలిపారు. దరఖాస్తులు https://apgpcet. apcfss. in/ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 24వ తేదీలోపు స్థానిక గురుకుల పాఠశాలలో అందజేయాలన్నారు. లక్కిరెడ్డిపల్లె గురుకులంలో ఐదోతరగతి ఎస్సీ- 70, బీసీ- 4, ఎస్టీ- 15, ఓసీ-1 చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. ఇంటర్మీడియట్‌లో ఎంపీసీ 40 సీట్లు, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయని ఆమె తెలిపారు.

ఘనంగా ముగిసిన వీరనాగమ్మ జాతర



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మల్లికార్జునరెడ్డి

వీరబల్లి : వీరనాగమ్మ జాతర బుధ, గురువారాల్లో ఘనంగా నిర్వహించారు. ఆలయంలో బుధవారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి భక్తులు ముడుపులు చెల్లించారు. చాందినీ బండ్లు, కుంకుమ బండి, పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. గురువారం బోనాలు కార్యక్రమం అట్టహాసంగా చేశారు. జాతరకు రాయచోటి, కడప, హైదరాబాద్, చెన్నై, బెంగుళూరు తదితర ప్రాంతాల నుంచి బంధువులను పిలిపించుకున్నారు. వీరనాగమ్మ జాతరలో బుధవారం రాత్రి ఆలయంలో రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథ్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు వీరనాగిరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. అమ్మవారికి కాయాకర్పూరం సమర్పించి ఆలయ అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామని ఎమ్మెల్యే, నాయకులు ఆలయ కమిటీకి తెలిపారు. అమ్మవారి ఆలయాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామని ఎమ్మెల్యే వారికి తెలిపారు.

పరామర్శ

రామాపురం : కల్పనాయునిచెరువు గ్రామం మాగిరెడ్డిగారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు జనార్దన్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి పొందుతున్నారు. గురువారం ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాగిరెడ్డిగారిపల్లెలోని ఆయన నివాసంలో ఆయనను కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా పూర్తి ఆరోగ్యంతో కోలువాలని ఆకాంక్షించారు. ఆయనతో పాటు జెడ్పీటీసీ వెంకటరమణ, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రామిరెడ్డి, వైస్ ఎంపీపీ బాబు, చెన్నారెడ్డి, రాజు, శివ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు



విద్యార్థులకు మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ రేఖ

లక్కిరెడ్డిపల్లి : పదోతరగతి, ఇంటర్మీడియట్ తరగతులలో విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రేఖ పేర్కొన్నారు. గురువారం మోడల్ స్కూల్‌లో ఇంటర్ విద్యార్థుల ఫేర్‌వెల్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ 2015 నుంచి ఏపీ మోడల్ కళాశాలలో మంచి ఫలితాలు సాధించి ట్రిపుల్ ఐఐటీలో ఎంతోమంది విద్యార్థులు ఇంజనీరింగ్ చేస్తున్నారని, అంతే కాకుండా అగ్రికల్చర్ కోర్సులలో మంచి ఫలితాలు సాధించి ఎంతోమంది ఉద్యోగాలు సంపాదించారని అన్నారు. ఈ ఏడాది కూడా పదోతరగతి, ఇంటర్మీడియట్‌లో మంచి ఫలితాలు సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని ఆమె సూచించారు. అనంతరం ఇంటర్ మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ప్రిన్సిపాల్ పరీక్షా మెటీరియల్ అందజేశారు. అనంతరం విద్యార్థుల చేసిన నృత్య ప్రదర్శన అలరించింది. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, అధ్యాపకులు శివశంకర్‌రెడ్డి, జమ్రుద్ బేగం, సుజాతమ్మ, శ్రీకళ, నిత్య పూజయ్య, సుధాకర్, శ్రీనివాసులు, మురళీ నాయక్, ఆసీఫాభాను, సుమియా, భారతి, అరుణ్ కుమార్, పీడీ సోమశేఖర్ నాయక్, ఉమామహేశ్వరి, సుధీర్, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు శంకర్‌రావు

సిద్దవటం : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దారు శంకర్‌రావు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పట్టభద్రుల, ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ ఎన్నికలు జరిగే పోలింగ్ కేంద్రాలను గురువారం తహసీల్దారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పోలింగ్ కేంద్రంలో తాగునీటి సమస్య, విద్యుత్, ఫ్యాన్లు, ఫర్నీచర్ వంటి సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మార్చి 13వ తేదీన జరిగే పోలింగ్ రోజు విద్యుత్ అంతరాయం ఏర్పడకూడదన్నారు. పోలింగ్ విధులు నిర్వహించడానికి ఇతర ప్రాంతాల నుంచి వచ్చే సిబ్బందికి వసతుల ఏర్పాట్ల కోసం ఆయా అధికారులకు తగు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ భాస్కర్‌రెడ్డి, స్థానిక వీఆర్‌ఓ కేశవులు, వీఆర్‌ఏ వెంకటపతి తదితరులు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు తాళిబొట్టు వితరణ

పెనగలూరు : మండల కేంద్రంలోని అరుంధతివాడకు చెందిన నూతన వధూవరులకు వడ్డెర సంఘం కువైట్ అధ్యక్షుడు తురక వెంకటసుబ్బయ్య తాళిబొట్టును వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే నూతన వధూవరులు ఎవరైనా తాళిబొట్టు కోసం తమను సంప్రదిస్తే అటువంటి వారికి తాళిబొట్టు అందజేస్తామన్నారు. అలాగే మండలంలో ఏ గ్రామమైన వడ్డెరలు పేదవారైతే మా సంఘం తరపున తాళిబొట్టుతోపాటు నగదును ఇస్తున్నట్టు ఆయన తెలిపారు.

లారీ క్లీనర్‌పై దాడి

మదనపల్లె : లారీ క్లీనర్‌పై కొందరు వ్యక్తులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన పట్టణంలో మంగళవారం రాత్రి జరిగింది. పట్టణంలోని ఎస్టేట్‌కు చెందిన ఎస్.నవాజ్‌బాషా (26) లారీ క్లీనర్‌గా పని చేస్తూ జీవిస్తున్నాడు. ఇతను స్థానికంగా ఉన్న చిల్లర దుకాణంలో సరుకులు కొనుగోలు చేస్తుండగా ఇరు వర్గాల వారు గొడవపడ్డారు. అక్కడే ఉన్న నవాజ్‌బాషా అడ్డుకుని గొడవపడవద్దని వారించాడు. దీంతో ఆగ్రహించిన వారు బాధితునిపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. దాడిలో నవాజ్‌బాషా తీవ్రంగా గాయపడగా, కుటుంబ సభ్యులు అతడిని జిల్లా ఆస్పత్రికి తరలించారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి తిరునాల

తంబళ్లపల్లె: మండలంలోని కుక్కరాజుపల్లెలో వెలసిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి తిరునాల వైభవంగా జరిగింది. పూజారి మల్లయ్య స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారిని చాందినీ బండిపై పురవీధుల్లో ఊరేగించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యుత్‌దీపాలతో అలంకరించిన చాందినీబండ్లు పలురకాల సాంస్కృతిక కార్యక్రమాలతో ఊరేగింపు నిర్వహించారు. బుధవారం కూడా స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించి భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి



పంట పొలాలను పరిశీలిస్తున్న ఏఓ నాగమణి

రామాపురం : కృషి విజ్ఞాన కేంద్రాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని పెంపొందించడం అనే పథకంలో 2022- 23 సంవత్సరానికి సంబంధించి ప్రకృతి వ్యవసాయంపై సాగు చేసే రైతులకు అవగాహన తెలుపుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి దిగుబడులు పొందవచ్చునని ఏఓ నాగమణి అన్నారు. మండలంలోని రాచపల్లె పంచాయతీ గంగనేరుకు చెందిన రైతు రామాంజులురెడ్డి ప్రకృతి వ్యవసాయంతో సాగు చేసిన వేరుశనగ పంటను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం అనుసరించడానికి రైతులు ఉత్సాహం చూపాలన్నారు. దీర్ఘకాలిక దిగుబడితో లాభాలు పొందవచ్చునని సూచించారు. విజ్ఞాన యాత్రలు శిక్షణ కార్యక్రమాలు క్షేత్ర ప్రదర్శనలు నిర్వహించామన్నారు. అనంతరం సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ శిల్పకళ మాట్లాడుతూ మండలంలోని 8 మంది రైతులకు వేరుశనగ పంటలకు పశువుల ఎరువులు పంట సాగులో వేయడానికి టీకోడెర్మ, జీవన ఎరువులు, విత్తనశుద్ధికి, రైజోబియం, సోడామోనాస్, ఎర్రపంటలు, సస్యరక్షణ, లింగాకర్షబుట్టలు, జిగురు పొలాలు, డెల్టా వేప నూనె వంటి ఉపకారాలు, యజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారని డాక్టర్ సాయి మహేశ్వరి శాస్త్రవేత్త తెలిపారు. కడప ఏరువాక కేంద్రం డాక్టర్ ప్రత్యూష శాస్త్రవేత్త మాట్లాడుతూ ఎరువుల యజమాన్యంలో పాటించాల్సిన మెళకువలు, పలు రకాల భూసార పరీక్షల అవశ్యకతను రైతులకు వివరించారు. కార్యక్రమంలో మండల యాంకర్లు వెంకటరామిరెడ్డి, ఉత్తమ రైతు శ్రీదేవి, రైతులు రామిరెడ్డి, ధర్మారెడ్డి, నాగరాజు, శ్రీదేవి పాల్గొన్నారు.

బిల్లులను త్వరితగతిన అప్‌లోడ్ చేయాలి

మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : గృహాల లబ్ధిదారుల బిల్లులను త్వరితగతిన అప్‌లోడ్ చేయాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం సాయంత్రం పక్కా గృహాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 10 గ్రామ పంచాయతీలలోని పక్కాగృహాల లక్ష్యాలను సాధించేందుకు అధికారులకు ప్రజాప్రతినిధులు సహకరించాలన్నారు. ఇప్పటి వరకు సంపూర్ణంగా పూర్తయిన గృహాలతోపాటు పూత దశల్లో ఉన్న గృహాలకు, రూఫ్ స్థాయిలో ఉన్న గృహాలకు, బేస్ మట్టం స్థాయిలో ఉన్న గృహాలకు, నిర్మాణాలకు నోచుకోని గృహాలను లబ్ధిదారులు త్వరితగతిన చేపట్టేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మార్చి నెలాఖరులోగా పక్కాగృహాలను పూర్తి చేసి నిధులు మరిగి పోకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు, వలంటీర్లు, యువత కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, కడప డీఎల్‌పీఓ మస్తాన్‌వలీ, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో గుడిసె దగ్ధం

రామసముద్రం : ఆర్.నడింపల్లె పంచాయతీ దిగువ బొంపల్లెకు చెందిన సుధాకర్ పూరిగుడిసె ప్రమాదవశాత్తు బుధవారం అగ్నికి ఆహుతైంది. సమాచారం అందుకున్న పుంగనూరు అగ్నిమాపక సిబ్బంది వచ్చేలోపే ఇంటిలో ఉన్న బియ్యం, దుస్తులు, వంట సామగ్రి పూర్తి కాలి బూడిదయ్యాయి. అగ్నిప్రమాద సమయంలో ఇంటిలో ఎవ్వరులేకపోవడంతో ప్రాణ నష్టం జరగలేదు. వంట చేసిన తరువాత నిప్పులు ఆర్పకపోవడంతో ఒక్కనే ఉన్న వంట సామగ్రికి నిప్పు అంటుకోవడంతో గుడిసె కాలిపోయినట్లు బాధితుడు సుధాకర్ తెలిపారు. సుమారు లక్షరూపాయల మేరకు నష్టం జరిగినట్లు అగ్నిమాపక సిబ్బంది అంచనా వేశారు. మంటలు ఆర్పడంలో స్టేషన్ ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు , సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్లకు నూతన వేతన సవరణ చేయాలి



ఇన్‌చార్జ్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న పెన్షనర్లు

లక్కిరెడ్డిపల్లి : పెన్షనర్లకు నూతన వేతన సవరణలు అమలు చేయాలని తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వీరవల్లి వెంకటరమణ పేర్కొన్నారు. గురువారం ఇన్‌చార్జ్ తహసీల్దార్ నరసింహులకు ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 11వ పీఆర్సీ అరియర్లు చెల్లించి పెన్షనర్లకు ఫిక్సేషన్ స్టేట్‌మెంట్ ఇవ్వాలన్నారు. అలానే 12వ పే కమిషన్ ఏర్పాటుకు ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలన్నారు. పెన్షనర్లకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు 492 జీఓ ప్రకారం మెడికల్ హెల్త్ కార్డులు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ట్రెజరర్ రామచంద్రయ్య, అధ్యక్షుడు విశ్వనాథ, సిద్దయ్య, రామకృష్ణ, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

యువత ఉజ్వల భవిష్యత్తు జగనన్నతోనే సాధ్యం

• ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో వైఎస్ఆర్‌సీపీ నేతలు



సంబేపల్లె: ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి



రాజంపేట టౌన్: వెన్నపూసకు ఓటు వేయాలని బ్యాలెట్ నమూనాను అందజేస్తున్న పోలా శ్రీనివాసులరెడ్డి



రాయచోటి అర్బన్: ప్రచారం చేస్తున్న వెన్నపూస రమాకాంత్‌రెడ్డి, ఫయాజుర్ రహిమాన్, మహమ్మద్‌ఖాన్‌లు



ఓబులవారిపల్లె: ఎన్నికల ప్రచారంలో సాయికిషోర్ రెడ్డి

రాయచోటి అర్బన్ : యువతకు ఉజ్వల భవిష్యత్తు కల్పన ముఖ్యమంత్రి జగనన్నతోనే సాధ్యమని మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, వైఎస్ఆర్‌సీపీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్‌లు అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీగా వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా పోటీచేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డి తరపున ఆయన సోదరుడు రమాకాంత్‌రెడ్డి, నేతలు అన్నా సలీం, షబ్బీర్ అహమ్మద్ తదితరులతో కలసి గురువారం పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. వీరితో పాటు పట్టణంలోని 34 వార్డులలో అయా వార్డుల వైఎస్ఆర్‌సీపీ కౌన్సిలర్లు, నేతలు, మద్దతుదారులు వెన్నపూస విజయం కోసం పట్టభద్రుల ఇళ్ళకు వెళ్ళి ఓట్లను అభ్యర్థించారు. ప్రచారంలో కొత్తపల్లె ఇంతియాజ్, ఉబేదూర్ రహిమాన్, ఇంతియాజ్, బాబాఫక్రుద్దీన్, బాలాజీ, ముజీబ్, రజాక్, ఇర్షాద్, పట్టణ మహిళా అధ్యక్షురాలు నాజనీన్ తదితరులు పాల్గొన్నారు.

పోలా విస్తృత ప్రచారం

రాజంపేట టౌన్ : ఎమ్మెల్సీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాస్‌రెడ్డి పట్టణంలో ప్రచారాన్ని ముమ్మరం చేశారు. అందులో భాగంగా గురువారం మున్సిపాలిటీ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాల్లో, వార్డుల్లోని పట్టభద్రుల ఓటర్లను కలిసి వెన్నపూస రవీంద్రారెడ్డికి తొలి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ మర్రి రవి, కౌన్సిలర్లు సనిశెట్టి నవీన్‌కుమార్, ఎస్ఎండీ న్యామతుల్లా, డొంక సూరి, రాఘవేంద్రవర్మ, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాల కన్వీనర్లు తిమ్మారెడ్డి, రఘు, అబ్దుల్ మునాఫ్, తోట లక్ష్మీనారాయణ, రాజేష్, ఖాజామోహిద్దీన్ పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల వైఎస్ఆర్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిగా బరిలో ఉన్న వెన్నపూస రవీంద్రారెడ్డికి మద్దతుగా గురువారం సంబేపల్లెలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్ఆర్‌సీపీ రాష్ట్రకార్యదర్శి చిదంబర్‌రెడ్డి, మండల కన్వీనర్ ఉదయకుమార్‌రెడ్డిలతో కలిసి ఆయన ఓటర్లతో సమావేశం నిర్వహించారు.కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : ఈ నెల 13న జరగనున్న పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో వెన్నపూస రవీంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్ఆర్‌సీపీ నాయకులు రమాకాంత్‌రెడ్డి కోరారు. ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి సూచనలతో మండలంలోని పడమటికోన గ్రామంలో పట్టభద్రులను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం జగన్ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డికి తమ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు శేషారెడ్డి, అంజనప్ప, శరత్, రమణ, రాము పాల్గొన్నారు.

ప్రచారంలో సాయికిషోర్‌రెడ్డి

ఓబులవారిపల్లె : రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టాక లక్షలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం అయ్యలరాజుపల్లి, చిన్నఓరంపాడు గ్రామాలలోని సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలలో ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ బలపరిచిన వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదట ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన పట్టభద్రులను కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎన్‌పీ జయపాల్‌రెడ్డి, జరుగు నారాయణ రెడ్డి, ముక్కా రమేష్‌కుమార్ రెడ్డి పాల్గొన్నారు.